శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కొడుకును ప్రభుత్వ కాలేజీలో చేర్పించిన జేసీ




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 10 ప్రభాతవార్త** చిన్నపాటి ఉద్యోగులే తమ పిల్లలను ప్రైవేట్-కార్పోరేట్ విద్యాసంస్థలలో చేరుస్తున్న ప్రస్తుత కాలంలో ఐఏఎస్‌హోదా కలిగిన ఓ జాయింట్ కలెక్టర్ తన కుమారుడ్ని ప్రభుత్వ (మునిసిపల్) జూనియర్ కాలేజీలో చేర్పించడం గమనార్హం. వివరాల్లోకి వెలితే జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తన కుమారుడైన త్రివిక్రమ్‌ను బుధవారం నెల్లూరు వీఆర్ కాలేజీ సమీపంలోని ప్రభుత్వ (మునిసిపల్) జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ సెకండీయర్‌లో చేర్పించారు. కొడుకును తీసుకొని స్వయానా కాలేజీకి వచ్చిన జేసీ అడ్మిషన్ ఫారమ్ తానే పూర్తిచేసి ప్రిన్స్‌పాల్‌కు అందజేయడం గమనార్హం.

## బోటు ప్రమాదంలో సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు



**కావలి రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త** కర్ణాటక రాష్ట్రం మంగుళూరులోని అరేబియా సముద్రంలో జరిగిన బోటు ప్రమాదంలో కావలి నియోజకవర్గానికి చెందిన 11 మంది మత్స్యకారులు మృత్యువుతో పోరాడి అతి కష్టం మీద బయటపడ్డారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గానికి చెందిన అల్లూరు, తుమ్మలపెంట, పెదరాముడుపాళెం, ఆదినారాయణపురంకు చెందిన 11 మంది మత్స్యకారులు బతుకుదెరువు కోసం మంగుళూరుకు వెళ్లారు. మరబోటులో అరేబియా సముద్రంలో చేపలు వేట సాగిస్తుండగా అలల ఉధృతికి బోటు క్రింద భాగంలో ఒక భాగం విరిగిపోయింది. నీరంతా బోటులోకి వస్తుండటం గమనించి మత్స్యకారులు భయాందోళన చెందారు. వెంటనే సమీపంలో వున్న మత్స్యకారులకు సమాచారం ఇచ్చారు. వారు మరో బోటులో ప్రమాద ప్రాంతానికి చేరుకొని 11 మందిని అతికష్టం మీద కాపాడగలిగారు. దీంతో 11 మంది మత్స్యకారులు సురక్షితంగా వారివారి స్వగ్రామాలకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, మత్స్యకారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా సురక్షితంగా బయటపడ్డ తుమ్మలపెంట మత్స్యకారులు మాట్లాడుతూ మా గ్రామంలో మాకు ఎటువంటి బ్రతుకు దెరువు లేనందున గత 10,15 సంవత్సరాల నుండి దాదాపు వంద మంది మత్స్యకారులు మంగుళూరు, మహారాష్ట్రలకు భార్యా, పిల్లలను వదిలి పెట్టి వెళ్తున్నామన్నారు. దాదాపు 15 రోజులుగా సముద్రంలో వుంటామని ఎన్ని కిలోమీటర్లు అయినా వెళ్లి చేపలు పట్టుకుంటామని తెలిపారు. బోటుకు రంధ్రం పడిందని ఆ నీటిని ఎవరూ ఆపలేరన్నారు. పక్కనే బోటు అందుబాటులో వుండబట్టి మేము ప్రాణాలతో బయటపడ్డామన్నారు. దేవుడు దయతో ప్రాణాలతో బయటపడటం ఎంతో గొప్ప అని ఆవేదన వ్యక్తం చేశారు.

## రెండో రోజు రొట్టెల పండుగ ఏర్పాట్లు పరిశీలించిన మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మక బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ రెండవ రోజు వివిధ నిర్వహణ ఏర్పాట్లను నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ స్వయంగా పర్యవేక్షించారు. స్థానిక స్వర్ణాల చెరువు రొట్టెలు మార్చుకునే ఘాట్ ప్రాంతము, స్టాల్స్‌ను, ఏపీ టూరిజం బోటు షికారు, కార్పొరేషన్ ఏర్పాటు చేసిన మంచినీటి స్టాల్స్ తదితర ఏర్పాట్లను పరిశీలించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రొట్టెలు మార్చుకునే ఘాట్ ప్రాంతంలో చెరువు నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, స్నానపు గదులలో నిరంతరం మంచినీరు సరఫరా అయ్యేలా పర్యవేక్షిస్తూ పారిశుధ్య నిర్వహణ పనులను అంతరాయం లేకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణాల చెరువు వద్ద భక్తుల రద్దీ, రక్షణ చర్యలను పరిశీలించేందుకు ఏపి టూరిజం బోటులో తీరం వెంబడి ప్రయాణించి సర్వే నిర్వహించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీరు నాణ్యత పరీక్షించేందుకు మేయర్ స్వయంగా నీటిని తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సిసి కెమెరాల పనితీరును పరిశీలలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి వాసంతి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ కార్యదర్శులు బాధ్యతగా ఉండాలి



**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన సచివాలయ వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా నడిచేందుకు కార్యదర్శులంతా విధుల్లో బాధ్యతగా ఉండాలని కమిషనర్ డి.హరిత ఆదేశించారు. స్థానిక మినీ బైపాస్ రామలింగాపురంలోని 19/1, 19/2 సచివాలయాలను కమిషనర్ బుధవారం పరిశీలించారు. అన్ని విభాగాల కార్యదర్శులు ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని హెచ్చరించారు. ప్రతి ఒక్క కార్యదర్శి ఆన్‌లైన్ అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఆస్తి పన్నులు, యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వ సక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## విద్యుత్‌దీపాలతో కళకళలాడుతున్న కలెక్టరేట్




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 10 ప్రభాతవార్త** భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతీయ పండుగలైన ఆగస్టు 15, జనవరి 26లలో కలెక్టరేట్‌ను విద్యుత్‌దీపాలతో తీర్చిదిద్దడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ రాబోయే స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేకత వుండడం.. ముందుగానే కలెక్టరేట్‌ను విద్యుత్‌దీపాలతో అలంకరించడం గమనార్హం.

## ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థుల డీబార్

**నెల్లూరు, ఆగస్టు10 ప్రభాతవార్త-విద్య** బుధవారంజిల్లాలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులు అధికారులు డీబార్ చేశారు. విద్యార్థుల ఓఎమా ర్ర్ షీట్‌లను స్వాదీనం చేసుకుని వారిని పరీక్షాకేంద్రం నుండి బయటకి పంపివేశారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మెత్తంగా 12842 మంది హాజరు కావాల్సి ఉండగా 12152 మంది హాజరైయ్యారు. 690మంది గైర్హాజరైయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు4343మంది హాజరుకావాల్సి ఉండగా 4048మంది హాజరైయ్యారు. 295మంది గైర్హాజరైయ్యారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వరప్రసాద్‌రావు 8 కేంద్రాలను తనిఖీచేశారు.

# దారులన్నీ దర్గావైపే..





**నెల్లూరుటౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త** బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ ఘనంగా జరుగుతోంది. రొట్టెల పండుగ రెండోవ రోజు బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బారాషాహీద్ దర్గాలను దర్శించుకున్నారు. తెలుగురాష్ట్రాల నుండే కాకుండా తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుండి కూడా భక్తులు తరలివస్తున్నారు. నెల్లూరు రొట్టెల పండుగ సంధర్బంగా స్వర్ణాలచెరువులో కొర్కెల రొట్టెల అందుకుంటే కోరుకున్న కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో ప్రతీ ఏడాది రొట్టెల పండుగకు లక్షల మంది భక్తులు హాజరై కోర్కెల రొట్టెలు అందుకుంటున్నారు. మందుగా భక్తులు దర్గాలోని బారా షహీదుల సమాధులను దర్శించి ప్రార్ధనలు నిర్వహించుకుని తర్వాత పక్కనే ఉన్న స్వర్ణాల చెరువులో పవిత్ర సాన్నాలు అచరించి రొట్టెలు అందుకుంటున్నారు. మరో వైపు భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేసారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం భక్తులకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్వయంగా అన్నదానం చేశారు.

# బారా షాహీద్ దర్గాలో గంధ మహోత్సవం



**నెల్లూటౌన్, ఆగస్టు 10 ప్రభాతవార్త** బారా షాహిద్ దర్గా రొట్టెల పండుగలో గంధమహోత్సవం అత్యంత కీలకమైన పవిత్ర కార్యక్రమని రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు బారాషాహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ బుధవారం రెండోవ రోజుకు చేరుకుంది. బుధవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులతో కలిసి బారాషాహీద్ దర్గాను సందర్శించారు. ఈసంధర్బంగా దర్గా ప్రాంగణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యటించి స్వర్ణాల చెరువు, స్నానాల ఘాట్లు, ప్రజా ఆశ్రయాలు, వివిధ దుకాణాలు, ఉచిత భోజనశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, భక్తుల సహాయ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం రిసెప్షన్ మానిటరింగ్ కేంద్రం చేరుకుని అక్కడ జిల్లా పోలీసు అధికారి సిహెచ్. విజయరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. రొట్టెల పండుగ ఈనెల 13వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందని, బుధవారం రాత్రి 11గంటలకు పవిత్రమైన గంధ మహోత్సవ కార్యక్రమం మొదలవుతుందని అర్ధరాత్రి ఒంటిగంటకు బారాషాహి దర్గా వద్దకు తీసుకు వస్తారన్నారు. ఈకార్యక్రమం అత్యంత కీలకమైన ప్రాధాన్యత కలిగిన కార్యక్రమంగా పేరో ్కన్నారు. ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గోనే అవకాశం ఉందన్నారు. ఈవిషయమై జిలా ్ల యంత్రాంగం, పోలీసు యంత్రాంగంతో సమీక్షించడం జరిగిందన్నారు. భక్తులు లక్ష మందికిపైగా వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేయడం జరిగిందన్నారు. అందుకు తగ్గట్టుగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామన్నారు. కడప పీఠాధిపతులు రేపు గురువారం బారా షహీద్ దర్గాకు రానున్నారన్నారు. అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేశామని జిల్లా పోలీసు అధికారి మున్సిపల్ కమీషనర్ మతపెద్దలతో చర్చించామని ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్విఘ్నంగా రొట్టెల పండుగ కార్యక్రమం సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్థానిక శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో సమన్వయం చేసుకొని అన్ని ప్రత్యేక జాగ్రత్త చర్యలు చేపడుతునా ్నమన్నారు. రొట్టెల పండుగ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమమని జిల్లాకు అల్లా ఇచ్చిన వరమని కొనియాడారు. దర్గా అభివృద్ధి కోసం కోటంరెడ్డి శ్రీథర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి 15కోట్లు నిధులను మంజూరు చేశారన్నారు. రాబోయే రోజుల్లో యుద్ద ప్రాతిపదికన దర్గా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. నగరపాలక సంస్థ ఎక్కడ రాజీ పడకుండా విస్తృతంగా పార్కింగ్, మంచినారు, మురుగుడొడ్లు, షెల్టర్లు, వసతి, బోజనాలు వంటి పలు సౌకర్యాలను ప్రత్యేక దృష్టితో అనుకున్న దానికంటే మిన్నగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కోవిడ్ కారణంగా గత రెండు సంవత్సరాలు రొట్టెల పండుగ జరలేదని ఈసారి పండుగ జరుగుతుండటంతో వివిధ ప్రాంతల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారన్నారు. ఏర్పాట్లు పక్కాగా చేసినందుకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు, జిల్లా పోలీసుఅధికారి విజయరావుకు, మున్సిపల్ కమీషనర్ హరితకు దన్యవాదాలు తెలిపారు. ఏఎస్‌పి హిమవతి, నెల్లూరు ఆర్డీఓ మలోల, మున్సిపల్ కమీషనర్ హరిత, ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డిఎస్పీ హరినాథ్‌రెడ్డి, కార్పోటరు యాకశిరి వాసంతి, స్థానిక నాయకులు గిరిధర్‌రెడ్డి, కనకదుర్గాభవాని, దర్గా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పోలీసు, మున్సిపల్ సిబ్బంది పాల్గోన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలి



**వెంకటాచలం ఆగస్టు 10 ప్రభాతవార్త** ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు సమస్యలను సత్వరంమే పరిష్కరించేలా సచివాలయ శిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె,విఎన్ చక్రదర్‌బాబు సచివాలయ శిబ్బందికి సూచించారు. మండల పరిదిలోని అనికేపల్లి 2, సచివాలయాన్ని బుదవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లడుతూ సచివాలయ శిబ్బంది క్రమశిక్షణతో పనిచేసి ఎటువంటి దరాఖస్తులు పెడింగ్ లేకుండా చూడలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సంతృప్తి చెందేలా మురుగైన సేవలు అందించాలన్నారు. జగనన్న కాలనీలో సంపూర్ణ గృహ హక్కు పదకం అమలు గురించి కలెక్టర్ గృహ నిర్మాణశాఖదికారులతో మాట్లడారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గృహనిర్మాశాఖ అదికారులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పలాలు అందేలా చర్యలు చేపట్టాలన్ని సచివాలయ శిబ్బందిని ఆదేశించారు. అనంతరం వి,వి గిరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈకార్యక్రములో కలెక్టర్ వెంట తహశీల్దార్ నాగరాజు, ఎంపీడివో సుస్మితరెడ్డి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గోన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ద్యేయం



**వెంకటాచలం ఆగస్టు 10 ప్రభాతవార్త** రైతు సంక్షేమామే ప్రభుత్వ ద్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిదిలోని చెముడుగుంటలో బుదవారం వైయస్సార్ యంత్ర సేవా పధకం కింద 34 నట్ల 80 లక్షల రూపాయలతో 223 ట్రాక్టర్లు, 33, వరికోత యంత్రాలు 11 కోట్ల 80 లక్షల రూపాయల సబ్బిడితో రైతులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ చక్రదర్‌బాబు చేతులు మీదగా పంపిణి చేశారు. అనంతరం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లడుతూ రైతు సంక్షేమానికి వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాదాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాద్యతలు చేపట్టిన వెంటనే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి రైతులకు 4 వేల ట్రాక్టర్లును మంజూరు చేయటం జరిగిందన్నారు. రైతులను అదికారులను సమన్వయ చేసుకుంటూ ప్రతి జిల్లా కేంద్రములో ఈ ట్రాక్టర్లును పంపిణి కార్యక్రము చేపట్టామన్నారు. రైతు కోరుకున్న మోడల్, ఏ ట్రాక్టరు కావాలన్న నేరుగా రైతులు కంపెనీలతో మాట్లడి కోనుగోలు చేసుకోనే విదంగా ప్రభుత్వం అవగాకాశము కల్పిండం జరిగిందన్నారు. దళారులకు తావులేకుండా నేరుగా నగదును రైతులు ఖాతాలో సబ్బిడిని వేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రైతులకు అండగా వుంటూ వారికి సుస్దిరమైన ఆదాయం లబించేలా ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. ప్రకృతి వైప్యరీత్యాలు సంబవించి రైతు నష్టపోయినప్పుడు ఆ సీజనల్‌లో రైతులకు విత్తనాలు పంట నష్ట పరిహారముఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులకు పంట బీమాను, ప్రీమియం, ఇన్‌పుట్ సబ్బిడి ప్రభుత్వ పంపిణి చేస్తుదన్నారు. రాష్ట్రంలో ఎన్నడులేని విదంగా రైతు భరోసా కేంద్రాలు ద్వారా నేరుగా రైతులకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. గత ప్రభుత్వంలో రైతు రథం పేరిట దోపిడి జరిగిందని అలాంటి వాటికి తావులేకుండా రైతు నేరుగా కావలసిన ట్రాక్టర్లును కోనుగోలు చేసే విదంగా రైతు యంత్ర సేవా పదకం ప్రారంబించడం జరిగిందన్నారు. ఈకార్యక్రములో జేసి కూర్మనాథ్ వ్యవసాయ సలహ మండలి అద్యక్షులు నిరంజన్‌బాబు రెడ్డి, రాష్ట్ర రైతు సాదికార సంస్ద స్టేట్ కో, ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, జేడి సుదకార్‌రాజు, తహశీల్దార్ నాగరాజు, ఎంపీడివో సుస్మితరెడ్డి, సర్పంచ్, జిల్లా వైసిపి అదికార ప్రతినిది మందల వెంకటశేషయ్య, కనుపూరు కోదండరామిరెడ్డి కుంచె రమేష్, సూరి, తదితరులు పాల్గోన్నారు.

**వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత: కలెక్టర్ చక్రధర్‌బాబు**

రైతులకు అండగా ఉంటూ ప్రతి సిజనల్‌లో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుంద న్నారు. జిల్లాలో సోమశిల, కండలేరు, జలశయాలు వలన సాగునీటి లభ్యత పెరగడంతో సాగు విస్తరణం పెరిగిందని దానికనుగుణంగా పూర్తి స్దాయిలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యాంత్రికరణ పనిముట్లు సబ్బిడిపై అందజేయనట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 60 శాతం మంది వ్యవసాయ్ం, వంరియ్ఋ, అన్ంబంధ్ రంగాలపైఆదారపడి జీవిస్తున్నారని వీరి సమస్యలు ఎప్పటికప్పడు పరిష్కరానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతినెల ఆర్ బికె స్దాయి నుంచి మండల, జిల్లా స్దాయి వ్యవసాయ సలహ మండల సమావేశాలు నిర్వహిస్తూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తుమన్నారు. రానున్న సంవత్సరములో సాంకేతికంగా వస్తున్న నూతన వ్యవసాయ విదానాలపై ప్రకృతి వ్యవసాయపై రైతులను మరింతగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ పునరుద్ధరించాలి




**కావలి, ఆగస్టు 10 ప్రభాతవార్త** దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని కావలి దళిత ముస్లిం, దళిత క్రిస్టియన్ ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు.కావలి ఏరియా వైద్యశాల ఎదురుగా వున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి బుధవారం ఐక్యవేదిక నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిసిఆర్ అధ్యక్షులు, పాస్టర్ డాక్టర్ మైనంపాటి యేసురత్నం, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ప్రతినిధి షేక్ షాన్‌వాజ్‌లు మాట్లాడారు. బ్రిటీష్ పాలకులు బడుగు, బలహీన వర్గాలను గుర్తించుటకు 1901.1911, 1931 సంవత్సరాలలో జరిగిన జనాభా (మతప్రాతిపదికన) లెక్కల ప్రకారం ముస్లిం కులాలు 133గా అంటరానితనం, అపరిశుభ్రమైన పనులు చేస్తున్న వారు 96 ముస్లిం కులాలుగా గుర్తించారన్నారు. 1929 నుండి మైనార్టీలు అంటే ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులే కాదు దళితులు, ఆదివాసీలు కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వుండేవన్నారు. 1934 నుండి ముస్లింలకు 25 శాతం రిజర్వేషన్, ఇతర మైనార్టీలకు 8.5 రిజర్వేషన్లు ఖరారు చేశారన్నారు. దళిత ముస్లింలకు 25 శాతం రిజర్వేషన్ తక్షణమే అమలయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. 1936 సంవత్సరంలో ఈ రిజర్వేషన్లను షెడ్యూల్ చేసి అమలు చేశారని తెలిపారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950 సంవత్సరం ఆగస్టు 10వ తేదిన హిందూ మతతేతరులనే కారణంతో ఎస్సీ రిజర్వేషన్ తొలగించారన్నారు. దీంతో భారతదేశంలో పాలకుల నిర్లక్ష్యంతో ముస్లింలు వెనుకబడ్డారన్నారు. సచార్ కమిటీ, రంగనాధ్ మిశ్రా కమిషన్ తన సిఫారసులలో పేజి నెం.163,164 ద్వారా రాష్ట్రపతి ఉత్వర్వులు 1950 పేరు 3ను తొలగించి వీరిరువురికి తిరిగి ఎస్సీ హోదా కల్పించాలని సిఫారసు చేసిందన్నారు. ఈ నివేదిక ఆధారంగా ఉమ్మిడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 2009 సంవత్సరంలో దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఎస్సీ రిజర్వేషన్లు తిరిగి కేటాయించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగిందన్నారు. వైఎస్ తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంటనే అసెంబ్లీలో దళిత ముస్లిం, దళిత క్రిస్టియన్లకు ఎస్సీ రిజర్వేషన్ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. అనంతరం కావలి ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మస్తాన్, షేక్ సిరాజ్ బాషా, షేక్ అయ్యూబ్, డి.టి.పాల్, ఎస్.కె.అనూక్, రెవ.ఐ.జె.సి.ప్రసాద్‌రావు, జి.జగదీష్, యం.యధీత్యా, యేసురత్నం పాల్గొన్నారు.

## బోగోలులో బీద పరామర్శలు



**బిట్రగుంట, ఆగస్టు 10 ప్రభాతవార్త** బోగోలు మండలంలో బుధవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సుడిగాలి పర్యటన నిర్వహించారు. బోగోలులో ఇటీవల మృతి చెందిన మాజీ ఉపసర్పంచ్ బి.రామకృష్ణ కుటుంబాన్ని, ఏనుగులబావిలో పంది రమణయ్య కుటుంబాన్ని పరామర్శించారు. వివిధ కారణాల వల్ల మృతి చెందిన కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి మనోధైర్యం కల్గించారు. వారి గతంలో పార్టీకి చేసిన సేవల్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మండల టిడిపి కన్వీనర్ యం.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం చేసిన మాలేపాటి



**బిట్రగుంట, ఆగస్టు 10 ప్రభాతవార్త** బోగోలు పంచాయతీలోని బేతనీయపేటలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మర్లపాటి అరుణకుమారికి టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు బుధవారం ఆర్థిక సహాయం అందించారు. బాధితురాలిని పరామర్శించి త్వరితగతిన కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షులు యం.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్. సుధీర్‌బాబు, పార్టీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లరెడ్డి, తదితరులు వున్నారు.

## మాజీ రాష్ట్రపతి వి.వి.గిరికి ఘన నివాళి



**బిట్రగుంట, ఆగస్టు 10 ప్రభాతవార్త** బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆజాదికా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర సమరయోధులు, మాజీ రాష్ట్రపతి స్వర్గీయ వి.వి .గిరి జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర పోరాటంలో, అనిబ్‌సెంట్ హోమ్ రూల్ ఉద్యమంలో,మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమంలో ఆయన పాత్ర కీలకమైనదని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి మేకల సుజాత, ఎంపిడివో నాసరరెడ్డి, నాగులవరం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ మద్దిబోయిన వీరరఘు, మాజీ ఎంపిటిసి మేకల శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్కార్ట్స్ సంస్థకు రూ. 10 వేలు వితరణ



**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** మానసిక , శారీరక వికలాంగ పిల్లలను చేరదీసి వారి ఆలనా పాలనా చేపట్టడమే కాకుండా వారికి విద్యాబుద్ధులు అందిస్తున్న ఎస్కార్ట్స్ సంస్థ సేవలు ఇతరులకు స్ఫూర్తి దాయకమని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘం నేత సుజయ్‌కుమార్ తెలిపారు. కోవూరులోని ఎస్కార్ట్స్ సంస్థకు బుధవారం ఆయన రూ. 10 వేలు అందజేశారు. రానున్న రోజుల్లో తమ సంస్థ ద్వారా వీరికి మరిన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మజ, ఎస్కార్ట్స్ సంస్థ నిర్వాహకులు రవి, అరుణ్‌కుమార్‌లు ఉన్నారు.

## గృహాలు నిర్మించుకోండి అన్ని విధాల సహకరిస్తాం



**బిట్రగుంట, ఆగస్టు 10 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీలోని 1,2,3 సచివాలయాల పరిధిలో పక్కా గృహాలు మంజూరై ప్రారంభించని లబ్దిదారుల కోసం బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఎంపిడివో నాసరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అందరికీ పక్కా గృహాలు నిర్మించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని ఇందుకు మెటీరియల్ ఉచితంగా అందించడం జరుగుతుంద న్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి స్వయం సహాయక బృందాల ద్వారా బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ఇందులో ఇబ్బందులు ఏమైనా వుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ వెంకటయ్య, నాగులవరం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ మద్దిబోయిన వీరరఘు, మాజీ ఎంపిటిసి మేకల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న భూరక్ష-భూహక్కు పదకం సద్వినియోగం చేసుకోండి



**బుచ్చి ఆగష్టు 10 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామంలో జగనన్న భూరక్ష- భూహక్కు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దారు శ్రీనివాసరావు తెలిపారు. జగనన్న భూరక్ష-భూహక్కు పథకం చాలా మంచి పథకం అని ఆయన తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఈకార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు .పంచేడు గ్రామరెవిన్యూ పరిధిలోని సర్వే సిబ్బంది భూయజమానుల సమక్షంలో సర్వే సిబ్బంది సంయుక్తంగా భూములను సర్వే చేస్తున్నారని ఆయన తెలిపారు.సర్వే సిబ్బంది నిర్దేశించిన సమయానికి భూయజమానులు వచ్చి భూములను సర్వే చేయించుకోవాలని ఆయన సూచించారు. విఆర్ఒ రామకృష్ణారెడ్డి సర్వే సిబ్బందితో కలిసి పంచేడు రెవిన్యూ పరిధిలోని భూములను సర్వే చేయించారు.

## బియంఆర్ ఎంపి కావడంతో సురే దంపతులు తిరుమలకు పాదయాత్ర



**కావలి రూరల్, ఆగష్టు 10 ప్రభాతవార్త** బీద మస్తాన్‌రావు రాజ్య సభ సభ్యులుగా ఎంపిక కావడంతో కావలి రూరల్ మండలం గౌరవరం మాజీ ఎంపిటిసి సభ్యులు సురే జయశ్రీ, ఆమె భర్త, వైసిపి నాయకులు సురే శ్రీనివాసులురెడ్డిలు బుధవారం గౌరవరం నుండి తిరుమలకు పాద్రయాత్రను చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావలి మాజీ శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు రాజ్యసభ సభ్యులుగా ఎంపికైతే గౌరవరం నుండి పాదయాత్ర చేస్తూ తిరుమలకు వెళ్లి శ్రీ వెంకటేశ్వరస్వామికి మొక్కు తీరుస్తామని మొక్కుకున్నామని తెలిపారు. ఆయన రాజ్య సభ సభ్యుడుగా ఎంపిక కావడంతో మొక్కుతీర్చుకునేందుకు తిరుమలకు పాదయత్రగా బయలుదేరామన్నారు. ఈ సందర్భంగా గౌరవరం ప్రజలు సురే దంపతులను ఆశీర్వదించి వారిని సాగనంపారు.

## రాయలసీమ సంస్కృతికి నాంది పలుకుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి




**కావలి, ఆగస్టు 10 ప్రభాతవార్త** ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే నోటికి వచ్చిన మాటలతో ప్రజల్ని దూషిస్తూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రాయలసీమ సంస్కృతికి నాంది పలుకుతున్నారని తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీని భయపెట్టాలనుకుంటే ఎవరితరం కాదని హెచ్చరించారు. కావలి రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కండ్లగుంట మధుబాబునాయుడు,టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పుటూరి బాలగురుస్వామి, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మస్తాన్‌లు మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కావలి మండలం బట్లదిన్నె గ్రామంలో గ్రామస్తులు రోడ్డుకు శంఖుస్థాపన చేసి సంవత్సరం పూర్తయిందని, ఎందుకు వేయలేదో చెప్పాలని, రోడ్డు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించారన్నారు. మంచిగా స్పందించి సమాధానం చెప్పాల్సిన ఎమ్మెల్యే నోర్మూయ్ అంటూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలను పగిలిపోద్ది అనడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఆయన వైసిపి వారికి ఎమ్మెల్యేనా లేక అందరికి ఎమ్మెల్యేనో చెప్పాలని ప్రతాప్‌కుమార్‌రెడ్డిని డిమాండ్ చేశారు.బిసిలను బెదిరింపులకు గురిచేయడం,ఇష్టానుసారంగా మాట్లాడటం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి తగదన్నారు. అదే అగ్రవర్ణాలను నోర్మూయ్, పగిలిపోద్ది అని అనగలరా అని ప్రశ్నిం చారు. ఎన్నికల ముందు మీరు ఇచ్చిన వాగ్దానాలను ప్రశ్నించకూడదా అన్నారు. ప్రశ్నిస్తే ఇలా బండబూతులు తిడతారా అన్నారు. ఎంతో మంది కావలి ప్రాంతంలో ఎమ్మెల్యేలుగా కలికి యానాదిరెడ్డి, గొట్టిపాటి కొండపనాయుడు, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మాగుంట పార్వతమ్మ, బీద మస్తాన్‌రావులు పని చేశారన్నారు. కానీ వారు ఇలాంటి సంస్కృతి ప్రదర్శించలేదన్నారు. నాటి ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అప్పుడు అధికార పార్టీని మీరు విమర్శించ లేదా అని ప్రశ్నించారు. వ్యక్తిగతంగా ఎవరినైనా విమర్శిస్తే పర్వాలేదు కానీ తెలుగుదేశం పార్టీని పడగొట్టాలంటే మీ తరం కాదని తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. రాబోయే రోజుల్లో ఎవరిని ప్రజలు పడగొడతారో తేలుతుందన్నారు. మీ మూడేళ్ల పాలనలో శాశ్వితంగా ఏ పని చేశారో చెప్పగలరా అని ప్రశ్నిం చారు. రామాయపట్నం పోర్టు కానీ, ఫిషింగ్ హార్బర్ కానీ, విమానాశ్రయంకు తెలుగుదేశం ప్రభుత్వం అడ్డంకులు తొలగించి జీవోలు పాస్ చేస్తే ఇప్పుడు పనులు జరుగుతున్నాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంచి పనులు చేసి పేరు తెచ్చుకోవాలని హితవు పలికారు. కావలి పట్టణ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఏటూరు శివకుమార్, పార్టీ నాయకులు మల్లి రమణయ్య పాల్గొన్నారు.

## ఆదరణ కేంద్రంలో కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం



**బిట్రగుంట, ఆగస్టు 10 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో బుధవారం అవార్డు స్వచ్ఛంద సంస్థ స హకారంతో అనాధ మహిళల జీవనోపాధి కోసం కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారం భించారు. అవార్డు సంస్థ జి.బాలశైలజ కేంద్రంలో కుట్టు నేర్పించేందుకు ముందుకు రావడం పట్ల భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున నిర్వాహకులు కె.సింహాద్రిరావు, భవానీలు కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహప్రతిష్ట



**జలదంకి,ఆగస్టు10,ప్రభాతవార్తః** జలదంకి యాదవవీదిలో నూతనంగా నిర్మితమైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం విగ్రహప్రతిష్టామహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది.వేదపండితుల మంత్రోశ్చరణలమద్య శ్రీకృష్ణుని శిలావిగ్రహాన్ని భక్తుల గోవిందనామ స్మరణఘోసలతో పవిత్రస్తానంలో ప్రతి స్టించారు .అంతకుముందు ఉదయం నిత్యార్చన,ప్రాతరోపాసనభూశుద్ది,గర్తపూజ వంటి పూజాదికార్యక్రమాలు చేపట్టగా యంత్రప్రతిష్ట,శఖరప్రతిష్టలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోకుంభాభిషేకం, దర్శనం,హారతి, శాంతి కళ్యాణంలు చేపట్టారు.తీర్ద ప్రసాదవినియోగం జరిగింది ఆప్రాంతం భక్తిభావంతో నిండి పోయింది.భక్తులు అత్యంత నియమనిష్టలతో ఆశ్రీకృష్ణపరమాత్మకి ప్రత్యేకపూజలు చేశారు.ఈపుణ్యకార్యాన్ని తిలకించేందుకు ఇతరప్రాంతాలనుంచికూడా అధికసంఖ్యలో తరిలివచ్చి స్వామివారి కృపకుపాత్రుల య్యా రు.మద్యాహ్నవేళ అన్నదాన కార్యక్రమం జరిగింది.నిర్వాహకులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసి అందరి ప్రశంశలందుకున్నారు.మొత్తంమీద ఈమూడు రోజులు గ్రామప్రజ ఆద్యాత్మిక చింతనలో మునిగిపోయింది.

## జలదంకిలో ఎం.ఆర్.పి.ఎస్ నిరసన



**జలదంకి,ఆగస్టు10,ప్రభాతవార్తః** మండలకేంద్రమైన జలదంకిలో బుధవారం మాదిగరిజర్వేషన్ పోరాట సమితి నిరసన కార్యక్రమం చేపట్టింది.స్తానిక కె.యు రోడ్‌నుంచి ఎం.ఆర్.పి.ఎస్‌రాష్ట్రనేత గోచిపాతల. వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శనగా తమసిల్‌దార్ కార్యాలయానికి చేరుకున్నారు.కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈసందర్బంగా వెంకటేశ్వర్లమాదిగ మాట్లాడుతూ ఎస్.సి వర్గీకరణచేసి మాదిగలకు న్యాయం చేస్తామని ఎన్నికల ముందు హామీయిచ్చిన ప్రధాని మోది తీరా గద్దెనెక్కిన అనంతరం మాట తప్పారని దుయ్యబట్టారు.వర్గీకరణ డిమాండ్‌తో గత 28ఏళ్ళగా ఎం.ఆ ర్.పి .ఎస్ వ్యవస్తాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆద్వర్యంలో న్యాయపరపోరాటం చేస్తుంటే పాలకులు మదిగలనుమోసగిస్తూనే వున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదికారంలోకి వచ్చిన వందరోజులలో పార్లమెంటులో బిల్లుపెడతామన్న బి.జె.పి నేటికి ఆవూసే ఎత్తకపోవడం ఏమిటని ప్రశ్నించాడు.బి.జె.పి ప్రభుత్వం తమ ఎన్నికల మేనీఫోస్టులో పొందుపరచని ఎన్నో చేస్తూ మరి ఎన్నికల హామీ అయిన వర్గీకరణ బిల్లును పార్లమెంటులో పెట్టి చట్టబద్దత కల్పించడంలో ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతుందుతో సమాజానికి చెప్పాలని అన్నారు.ఇప్పటికైనా ఈబిల్లు విషయంలో చొరవచూపకపోతే మాదిగజాతి మిమ్ములను ఎప్పటికి క్షమించదని హెచ్చరించారు.అనంతరం డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని తహసిల్‌దార్ శీతామహాలక్ష్మికి అందజే శారు.ఈ నిరసనలో ఎం.ఆర్.పి.ఎస్,ఎం.ఎస్.పి,ఎం.ఇ.ఎఫ్,ఎం.ఎస్.ఎఫ్ అనుబంధ సంఘాల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేవూరు వెంకటేశ్వర్లుకు నివాళులు అర్పించిన వీరి చలపతిరావు



**కొడవలూరు ఆగష్టు 10 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం, నార్త్‌రాజుపాలెంలోని వైసిపి నాయుకుడు చేవూరు వేణుయాదవ్ తండ్రి చేవూరు వెంకటేశ్వర్లు యాదవ్ కర్మక్రియలను బుధవారం వారి స్వగృహం నం దు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు హాజరైనారు. చేవూరు వెంక టేశ్వర్లు చిత్ర పటానికి నివాళులు అర్పించినారు, వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. మండల కన్వీనర్ గంథం వెంకటేశ్వర్లు, స్థానిక వైసిపి నాయకులు పాల్గోన్నారు.

## మహనీయుల త్యాగఫలితమే నేటి స్వాతంత్ర్యం



**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** దేశ స్వాతంత్ర్య సమపార్జన కొరకు మహనీయులు చేసిన పోరాట ప్రతిమను , శాంతి మార్గాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఈవోపీఆర్డీ కల్పన తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీవీ గిరి ఉప రాష్ట్రపతిగా , రాష్ట్రపతిగా దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, డ్వామా ఏపీవో సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## నేత్రదానానికి సహకరించాలి

**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** సమాజంలో గత రెండు సంవత్సరాలుగా కరోనా కారణంగా నేత్రదానం జరగలేదని, ప్రస్తుతం నేత్రదానం పట్ల ప్రజలు అవగాహన చేసుకుని దానిని ప్రోత్సహించాలని సుభాష్ సేవా సంఘం అధ్యక్షులు సురేష్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో పి. రత్నమ్మ అనే మహిళ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కోరిక మేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సుభాష్ సేవా సంఘ: ప్రోద్భలంతో రత్నమ్మ రెండు నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా సహకరించిన కుటుంబ సభ్యులకు సురేష్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నేత్రదానం మోటివేటర్ బాలాజీ సింగ్, తదితరులు ఉన్నారు.

## 'నెట్టెం' వివాహ వేడుకల్లో 'బొల్లినేని'



**వింజమూరు, ఆగస్ట్10, ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని నెట్టెం రమేష్‌కుమార్తె గంధపు నలుగుకు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ చెంచలబాబు యాదవ్‌లు హాజరై నూతన వధువును ఆశీర్వదించారు. మండల టిడిపి అధ్యక్షుడు గూడా నరసారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి, నాయకులు గురజాల వాసు, పాములపాటి మాల్యాద్రి, కొండపల్లి వెంకటేశ్వర్లు, జావా మహేంద్ర, యారం కృష్ణయ్య, చెన్నుపాటి ప్రసాద్, ఏడుకొండలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిఒఎంఎస్ నెం:50 పై హర్షం

**వింజమూరు,ఆగస్ట్10,ప్రభాతవార్త:** నాయీబ్రాహ్మణులపై సమాజంలో అనుచిత వాఖ్యలు చేయడం నేరం , నిషేదంగా భావిస్తూ అలా అనుచిత వాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా మెజిస్ట్రేట్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు కంభంపాటి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. నాయీబ్రాహ్మణులను సమాజంలో వివక్షతోపాటు చిన్నచూపు, హేళన చేసేవారు ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ద్వారా వారిపై చర్యలు తీసుకునేందుకు సిఫార్సు చేయడం ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు కల్పించిన హక్కుగా ఈసందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కలసపాటి వెంకటసుబ్బయ్య, నెల్లూరు కేశవప్రసాద్, వల్లూరు వెంకటరత్నం, వెంకటేశ్వర్లు , శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, గాజులపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో అందరూ హ్యాపీ



జలదంకి,ఆగస్టు10,ప్రభాతవార్తః ముఖ్యమంత్రి జగనన్న పాలనలో అన్నివార్గాల ప్రజలు సుఖ,సంతోషాలతో వున్నారని ఉదయగిరి శాసనసభ్యుడు మేకపాటి.చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. బుదవారం జలదంకి మండలం జమ్మలపాలెంలో ఏర్పాటుచేసిన జగనన్న మెగాలేఅవుట్ ప్లాట్ల కేటాయింపులో ఆయన పాల్గొన్నా రు.ఈ సందర్బంగా ఎం.ఎల్.ఎ మాట్లాడుతూ వై.సి.పి ప్రభుత్వం అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధకనపరస్తుందన్నారు.నవరత్నాలు అమలుచేసి అందరి ప్రశంశ అందు కుంటుందన్నారు.పాలనలో దేశంలో ఏరాష్ట్రంలో లేని విదంగా ముందుకుపోతూ అందరికి అదర్శప్రాయంగా నిలుస్తున్నారన్నారు.అభివృద్ది ప్రదాత అయిన జగనన్నను ఎన్నికలు ఎపుడు వచ్చినా తిరిగి ఆయననే ఎన్నుకునేందుకు ప్రజలు సిద్దం గా వున్నారని స్పష్టంచేశారు. కావలి ఆర్.డి.ఒ శీనానాయక్,సర్పంచ్ బుర్రి.శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకులు కావాలి

**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** కళాశాలల్లో జూనియర్లుగా చేరేవారికి సీనియర్ విద్యార్థులు స్నేహపూ ర్వకమైన వాతావరణం ఉండడమే కాకుండా జూనియర్ విద్యార్థులకు ఆదర్శ పూర్వకమైన మార్గదర్శకం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్ అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ర్యాగింగ్, మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కళాశాలలో ర్యాగింగ్ నిరో ధానికి కఠిన చట్టాలు రూపకల్పన చేసిందన్నారు. ర్యాగింగ్‌ను క్రిమినల్ చర్యగా న్యాయస్తానం పరిగణిస్తుందన్నారు. ఈ నేపథ్యం లో సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ భావి జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని సూచించారు. కళాశాలలో చేరే జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పోటాల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్, మానవహక్కుల సంఘం చైర్మన్ ఎం. సుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై. మురళీకృష్ణలు పలు సూచనలు చేశారు.



## వీవీ గిరి, సుందారాచారిలకు ఘనంగా వీడ్కోలు

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 10 ప్రభాతవార్త** దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వరాహగిరి వెంకటగిరి (వీవీగిరి), తెలుగుజాతి ఔన్నత్యాన్ని చాటిన 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గేయ రచయిత శంకరంబాడి సుందరాచారిలకు జిల్లా యంత్రాంగం ఘనంగా నివాళులు అర్పించింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం వరాహగిరి వెంకటగిరి, శంకరంబాడి సుందరా చారిల జయంతి పురస్కరించుకొని దేవా దాయ-ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాం గణంలో జిల్లా అధికారులు వారికి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీ.వెం కటనారాయణమ్మ మాట్లాడుతూ దేశస్వాతంత్రం కోసం పోరాడిన యోధులలో భారతరత్న వరాహగిరి వెంక టగిరి చిరస్మరణీయులన్నారు. 1894 ఆగస్టు 10న ఒరిస్సా రాష్ట్రంలోని బరంపురంలో జన్మించిన వీవీగిరి మహాత్మాగాంధీ అనుచరులుగా వుంటూ స్వా తంత్ర్య పోరాటంలో పాల్గొని పలుమార్లు కఠిన కారాగార శిక్ష అనుభవించారన్నారు. స్వాతంత్రానంతరం రాజాజీ మంత్రివర్గంలో కార్మిక-పరిశ్రమలశాఖామంత్రిగా పలు ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారన్న డిఆర్వో అత్యున్నతమైన భారతరత్న అవార్డు సాధించడంతోపాటు ఉపరాష్ట్రపతిగా-రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. ఇక శంకరంబాడి సుందరాచారి తెలుగు జాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గేయాన్ని మనకు అందించారన్నారు. ఆజా దీకా అమృత్ మహోత్సవ్ నేపథ్యంలో అటువంటి వారిని స్మరించుకోవడం దేశ ప్రజలందరీ కర్తవ్యమన్నారు.



**పితృదేవతల్లా అమరవీరులను స్మరించుకోవాలి..డీపీఓ** జిల్లా పంచాయితీ అధికారి ఎం.ధనలక్ష్మి మాట్లాడుతూ స్వేచ్ఛగా జీవిస్తుండడంతోపాటు సామాజికంగా..ఆర్ధికంగా మనగలుగుతున్నామంటే అది ఆనాటి మహానుభావుల త్యాగఫలితమేనన్నారు. ఈ నేపధ్యంలో అటువంటి వారిని పితృదేవతల్లా స్మరించుకోవాల్సిన బాధ్యత, భావితరాలకు వారి గురించి తెలియజేయాల్సిన కర్తవ్యం అందరిపై వుందన్నారు. సమగ్రశిక్ష ఏపీడీ ఉషారాణి తదితరులు మా తెలుగుతల్లికి మల్లెపూదండ గేయాన్ని ఆలపించడం గమనార్హం. దేవా దాయ-ధర్మాదాయశాఖ సహాయ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి, జిల్లాపరిషత్ సీఈఓ వాణి,ఐటిడిఏ పీఓ మందరాణిలతోపాటు జిల్లాలోని దేవాదాయశాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమం,అభివృద్దికి నిర్వచనం జగనన్న పాలన



**విడవలూరు ఆగష్టు 10 ప్రభాతవార్త** సంక్షేమం,అభివృద్ధికి నిర్వచనం జగనన్న పాలన అని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం పంచాయితీలోని వెంకట నారాయణపురం ప్రశాంత్ గిరి గ్రామాలలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతు గడపగడపకు కార్యక్రమానికి ప్రజలు విశేష స్పందన లభిస్తుందని అన్నారు. జగనన్న సంక్షేమ పధకాలు దళా రుల బెడద లేకుండా నేరుగా లబ్దిదారులకే అందుతాయని చెప్పారు.ప్రజలు మరోసారి కూడా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేస్తారని అన్నారు.గడగడపకు కార్యక్రమంలో ప్రజలు విశేష ఆదరణ చూపిస్తున్నారని అన్నారు. వెంకట నారాయణపురంలో కొండూరు గౌరమ్మ కుటుంబానికి ఎనిమిది లక్షలా 14 వేలు రూపాయాలు లబ్ది చేకూరిందని అన్నారు.ఈ సందర్భంగా ఆకుటుంబం జగనన్నకు,ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయమండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి,ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్ఆర్‌సిపి గౌరవాధ్యక్షులు నవీన్ కుమార్‌రెడ్డి,వైసిపి మండల పార్టీ కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు అచ్యుత్‌కుమార్‌రెడ్డి,కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, మురళీదర్‌రెడ్డి,తాతా ప్రభాకర్,అంకయ్యగౌడ్,ఎంపిటిసి ఆవుల శ్రీనివాసులు, ప్రజాప్రతినిదులు, అధికారులు వాలింటర్లు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చోరీకి గురైన రైల్వే ఉద్యోగి ద్విచక్రవాహనం

**కావలి, ఆగస్టు 10 ప్రభాతవార్త** బిట్రగుంటలో రైల్వే ఇంజనీరింగ్ డిపార్ట్‌మెం ట్‌లో క్లాస్ 4 ఎంప్లాయిగా పనిచేస్తున్న కావలికి చెందిన ఉప్పుటూరు మాధవ రావు ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈ చోరీపై బాధితుడు అనుమానం వ్య క్తం చేశారు. కావలి రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను బిట్రగుంటలో రైల్వే ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో క్లాస్ 4 ఎంప్లాయిగా పనిచేస్తున్నానన్నారు. రోజూ బిట్ర గుం టకు వెళ్లి వస్తున్నానని తెలిపారు. ఈ నేపధ్యంలో జులై 23వ తేది సాయంత్రం 6.30 గంటలకు కావలిలోని సీనియర్ సెక్షన్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద వాహనాన్ని పార్కు చేసి అత్యవసర పని మీద చెన్నైకి వెళ్లానన్నారు. తిరిగి జులై 26వ తేది సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో కావలికి చేరు కున్నానన్నారు. తాను పార్కు చేసిన వాహనం వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదన్నారు. దీంతో అక్కడ వు న్న వాచ్‌మెన్లు ముగ్గుర్ని విచారించగా మాకేమి సంబంధం లేదని చెప్పారన్నారు. రాత్రి 9 గంటలకు వా చ్‌మెన్లు తాళాలు వేసి తిరిగి తెల్లవారి ఏడు గంటలకు తీస్తారని తెలిపారు. ఇలాంటి తరుణంలో తన వా హనం బయట వారు దొంగలించారా లేక ఇంకెవరైనా అని అర్ధం కాని పరిస్థితులలో వున్నానన్నారు. రైల్వే పోలీసులకు, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

## నేడు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్

నెల్లూరు ఆగస్టు 10, ప్రభాతవార్త-వైద్యం ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా నేడు నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ కార్యాలయం నుంచి బుధవారం వెలువడిన ఒ ప్రకటనలో తెలిసింది. ఈ పాదయాత్ర ఉదయం 7గంటలకు నగరంలో గాంధీబొమ్మ కూడలి నుండి బయలుదేరి (13 కిలోమీటర్లు) ఉన్న పల్లిపాడు గ్రామంలో ఉన్న పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. మార్గం మధ్యలో 9గంటలకు నాలుగోవ మైలు వద్ద అల్పాహారం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు ఏవరైనా ఈ పాదయాత్రలో పాల్గొనవచ్చుని ఆ ప్రకటనలో తెలిసింది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిధిగా కలెక్టర్ కెవిఎన్.చక్రధర్‌బాబు పాల్గొంటారని అందులో పేర్కొన్నారు.

## కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ధర్నా




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 10 ప్రభాతవార్త** ఎస్సీ వర్గీకరణకు చట్టభద్రత కల్పించాలని..హైదరాబాద్‌లో జరిగిన బిజెపి విజయసంకల్పసభలో నిరసన తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులపై దాడులకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి జిల్లాశాఖ ప్రతినిధులు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. గాంధీబొమ్మ నుండి నినాదాలు చేసుకుంటూ కలెక్టరేట్‌కు వచ్చిన ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు ఎస్సీ వర్గీకరణకు చట్టభద్రత కల్పించాలంటూ నినాదాలు చేయడంతోపాటు భారతీయ జనతపార్టీకి, ప్రధానమంత్రి మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో పాల్గొన్న ఎంఎస్‌పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, జిల్లా నాయకులు మంద పెంచలయ్యమాదిగ, కోలగట్ల రమే ష్‌మాదిగ, తాళ్ళూరి శేషయ్యమాదిగ, బద్దిపూడి వివేక్‌మాదిగ, కంటేపల్లి చెంగయ్యమాదిగలు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇచ్చిన హామీని బిజెపి నిలబెట్టుకోవాలన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలల్లోనే ఇందుకు సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలన్నారు. గతనెల 3న హైదరబాద్‌లో జరిగిన బిజెపి విజయ సంకల్పసభలో నిరసన తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులపై దాడులకు పాల్పడ్డవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

## కలెక్టరేట్ వద్ద క్రైస్తవుల నిరసన ప్రదర్శన




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 10 ప్రభాతవార్త** దళిత క్రిస్టియన్స్-ముస్లీమ్‌లకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్‌జిల్లాశాఖ ఆధ్వర్యంలో పాస్టర్లు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సారధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లాశాఖ అధ్యక్షులు రెవ డా.దాసరి రాజశేఖర్, డాక్టర్ వి.సురేంద్రబాబు, రెవ బి. డేవిడ్ దయాసాగర్ తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన మతస్వేచ్ఛను హరించేవిధంగా 1950 ఆగస్టు 10 అప్పటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఉత్తర్వులివ్వడం జరిగిందన్నారు. దీనివల్ల షెడ్యూల్ తెగలవారు హిందూమతాన్ని వదిలి ఇతర మతాలు స్వీకరిస్తే వారి ఎస్సీహోదా పోతుందన్నారు. మతస్వేచ్ఛను హరించేలా..వివక్షతతో కూడిన ఈ ఉత్తర్వులను తీసివేయాలంటూ ప్రతి ఏటా ఆగస్టు 10 నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోరాటాల ఫలితంగా సిక్కుమతం స్వీకరించిన ఎస్సీలకు ఎస్సీ హోదా కొనసాగిస్తూ 1956లో, బౌద్ధమతం స్వీకరించిన ఎస్సీలకు ఎస్సీ హోదా కల్పిస్తూ 1990లో ప్రభుత్వాలు ఉత్తర్వులివ్వడం జరిగిందన్న వారు క్రైస్తవమతం స్వీకరించిన ఎస్సీలకు ఎస్సీ హోదా కల్పించకపోతుండడం దారుణమన్నారు. ఇకనైనా దళిత క్రిస్టియన్స్‌కు ముస్లీమ్‌లకు ఎస్సీ హోదా కల్పించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని పాస్టర్లు డిఆర్వో వెంకటనారాయణమ్మకు అందజేశారు.

## తోపుగుంటలో గడగడపకు విశేషస్పందన



**కలువాయి ఆగష్టు 10 ప్రభాతవార్త** మండలంలోని తోపుగుంట గ్రామ పంచాయితీ పరిధిలో గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జడ్పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ మంత్రి వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ముందుగా 75 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్వహించిన హర్‌గుర్ తిరంగా ర్యాలీలో శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి పాల్గోన్నారు.జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్బంగా గడగడపకు మన ప్రభుత్వం అనే వినూత్నమైన కార్యక్రమాంలో ఇంటింటికివెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన ఈకార్యక్రమంలో లబ్దిదారులు పొందిన సంక్షేమపధకాలు వివరించారు.వారు తెలిపిన సమస్యలను అదికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పధకాలు కొందరికే దక్కాయని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత అర్హతకలిగిన వారికి ప్రామాణికంగా సంక్షేమపధకాలు అందజేస్తున్నారని ఆయన తెలిపారు. సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు తోపుగుంట గ్రామ సచివాలయ పరిధిలో 2 వేల 5 వందల 72 మందికి వైఎస్ఆర్ నవరత్నాల ద్వారా పలు సంక్షేమపధకాలు లబ్ది 6కోట్లా 90 లక్షాల 49 వేల రూ పా యాలు నేరుగా వాళ్ళ బ్యాంకు ఖాతాలో జమచేయడం జరిగిందని ఆనం పేర్కున్నారు.తోపుగుంట సచివా లయ పరిధిలో నూతన సచివాలయ భవన నిర్మాణానికి 40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి 21.80 లక్షలు,హెల్త్ వెలెనెస్ సెంటర్ కోసం 17.50 లక్షలు ,బల్క్‌మిల్క్ సెంటర్‌కోసం 17.64 లక్షలు డిజిటల్ లైబ్రరీకోసం 16 లక్షలు,బాలాజిరావుపేటలో 16 లక్షలు వెచ్చించి నూతన భవనాలను నేర్మిస్తున్నట్లు ప్రజాదర్బార్‌లో ఆనం తెలిపారు.జలజీవన్ నిధులతో తోపుగుంట అగ్రహారంలో 4 లక్షలు బాలాజిరావుపేటలో 4 లక్షలు, ఎస్‌సి,ఎస్‌టి కాలనీలలో 3 లక్షలు వెచ్చించి అవసరమైన అన్ని ప్రాంతాలకు మంచినీటి వసతి ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అదే విధంగా బాలాజిరావుపేటలో ఆర్‌ఒఎం వాటర్‌ప్లాంట్ 5లక్షాల 50వేల రూ పాయలతో శంకుస్దాపన చేశారు. ప్రభుత్వం అందించే ఈ సంక్షేమపధకాలలో ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా వాలింటరీలు,సచివాలయాల సిబ్బంది, అదే విధంగా మండల స్దాయి అధికారులు వారదిగా ఉండాలని ఈ సందర్బంగా ఆయన పేర్కున్నారు.ఈకార్యక్రమంలో ఎన్‌డిసిసి మాజీ చైర్మన్ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టుకూరు దనుంజయ్‌రెడ్డి,జడ్పిటిసి సభ్యులు అనీల్‌కుమార్‌రెడ్డి,ఎంపిపి ఆర్ లక్ష్మీదేవి,తహసిల్దారు శ్యామ్ సుందరరాజు,ఎంపిడిఒ గాయిత్రిదేవి,ఎంఇ సుధీర్‌బాబు వైస్ ఎంపిపి పెంచల నంసారెడ్డి, తోపుగుంట , బాలాజిరావుపేట సర్పంచ్‌లు నాపానిఖిల్,సోమల సురేష్‌రెడ్డి,సొసైటీ అద్యక్షులు చల్లా సుబ్బరామిరెడ్డి,మాజీ వైస్ ఎంపిపి ఎంవి కృష్ణారెడ్డి,ఎంపిటిసి సభ్యులు ఎన్‌వి ప్రసాద్,వైసిపి నాయకులు రాఘవేంద్ర,వై వెంకటేశ్వర్లునాయుడు,తోపుగుంట ఆర్‌బికె చైర్మన్ ఎం చంద్రబాబునాయుడు,సురేష్ ,వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## ప్రతి ఇంటిపైన మువ్వన్నెల జెండా ఎగరాలి

**సంగం ఆగష్టు 10 ప్రభాతవార్త** సంగం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సుజాత,జిఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గోన్నారు.ఈ సందర్బంగా హర్‌గర్ తిరంగా కార్యక్రమం పై వారికి పలు సూచనలు ఇచ్చారు .ఐదురోజులుపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్బంగా ఎంపిడిఒ సుజాత మాట్లాడుతు మండలానికి 6490 జాతీయ జెండాలు వచ్చాయని తెలిపారు.పెన్షన్ కలిగిన ప్రతి కుటుంబం యొక్క ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేస్తామని పేర్కున్నారు. ఈకార్యక్రమంలో ఇఒపిఆర్‌డి అప్పాజీ, సచివాలయ సిబ్బంది పాల్గోన్నారు.



## అర్హులందరికీ నవరత్నాలు



**చేజర్ల,ఆగస్ట్10,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్న విధంగా నవరత్నాల కార్యక్ర మంలోని పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ, బుధవారాల్లో యనమదల సచివాల యం పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. సచివాలయం పరిధిలోని కాకివాయి, కండా పురం, బిల్లుపాడు, యర్రబ ల్లి, యనమదల గ్రామాల్లో బృందాలుగా ఏర్పడి గడప గడపకు తిరిగి ప్రభుత్వ పథకాలు అందు తున్నాయా లేదా ప్రభుత్వ పరిపాలన పట్ల ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. అధికారులతో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. తక్షణ మే పరిష్కరించే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవాటిని కూడా త్వరితగతిన పరిష్క రిం చాలని అధికారులకు సూచించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటుందన్నారు. ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో అందరికీ న్యాయం జరిగేలా పథకాలను రూపొందించారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల ప్రజలనుంచి సానుకూల స్పందన లభిస్తుందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను పరిశీలించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా బృందాలుగా వచ్చి పథకాలను పరిశీలించారు . గ్రామీణ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సిసిరోడ్లు , సైడ్‌డ్రె యిన్‌లను పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ళ స్థలాల సమస్యలను వెంటనే పరిష్క రిం చడంతోపాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ళస్థలాలు, ఇళ్ళను మంజూరు చేస్తామన్నారు. వాలంటీర్లు వారి పరి ధిలోని ఇళ్ళలోని సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించేలా చూడాలన్నారు .ఈకార్యక్రమంలో యనమదల సర్పంచ్ నోటి సుందరరామిరెడ్డి, మండల కన్వీనర్ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఒ నాగేంద్రకుమార్, తహ సిల్దార్ బి.శివకృష్ణయ్య, ఎంఇఒ పంచాగ్నుల కళాధర్, వ్యవసాయాధికారి వి.శశిధర్, ఎపిఎం సుజీవన, అన్ని గ్రామాల అధికారులు , కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యంఆటోలు సీజ్



చేజర్ల,ఆగస్ట్10,ప్రభాతవార్త: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న రెండు ఆటోలను విజిలెన్స్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. విజిలెన్స్ సిఐ సుధాకర్‌రెడ్డి, సివిల్‌సప్లయీస్ డిప్యూటీ తహసిల్దార్ ఇండ్ల రవి ముందుగా అందిన సమాచారం మేరకు చాటగుట్ల సమీపంలో ఆటోలను సీజ్ చేశారు. నాగులవెలటూరుకు చెందిన పెమ్మసాని వెంకటకష్ణయ్య 100 బియ్యం బస్తాలను ఒక ఆటోలో తరలిస్తుండగా సీజ్ చేసినట్లు సిఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. చింతలాత్మకూరు లో మరో ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు . ఆటోవాలాల సమాచారం మేరకు వెరుబొట్లపల్లిలోని చౌకదుకాణంలో అదనంగా ఉన్న 13బస్తాలను , చింతలాత్మకూరులోని రేషన్‌షాపులో అదనంగా ఉన్న 33బస్తాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఆటోలు, బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది రమణయ్య, మోహన్‌కృష్ణ, మస్తాన్‌బాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ది సాధ్యం



**కావలి, ఆగస్టు 10 ప్రభాతవార్త** కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి తెలిపారు. కావలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు ఆధ్వర్యంలో బుధవారం స్వతంత్ర భారత గౌరవ యాత్ర నిర్వహించారు. కావలి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనేక మంది స్వాతంత్ర సమరయోధుల త్యాగ్యాలతోనే మనకు స్వాతంత్రం వచ్చిందన్నారు. రాష్ట్రంలో అధికారంలో వున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రతిపక్షంలో వున్న నారా చంద్రబాబునాయుడులు ఇద్దరు కలిసి ప్రధాని నరేంద్ర మోడీ పల్లకీ మోస్తుండటం ఏమిటని ప్రశ్నించారు. ఇదంతా ప్రజలు చూస్తున్నారన్నరు. రాబోవు రోజుల్లో ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్టానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా, విభజన హామీలు నెరవేర్చకపోయినా వారు బిజెపికి మద్దతు ఇవ్వడం హాస్యాస్పదంగా వుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ళ సురేష్‌బాబు, పట్టణ అధ్యక్షులు అనుమాలశెట్టి శ్రీనివాసులు, కనుమూరి భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలు కొనసాగించాలి

**కావలి రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త** దేశం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలను కొనసాగించాలని సామాజిక కార్యకర్త, కావలి శాఖా గ్రంధా లయ అభివృద్ధి కమిటీ సభ్యులు యం.మాల కొండారెడ్డి తెలిపారు. కావలి వెంగళరావు నగర్‌లోని ప్రభుత్వ శాఖ గ్రంధాలయ ఆవరణలో గ్రంధాలయ అధికారిణి ఎస్.సునీత ఆధ్వర్యంలో బుధవారం ఆజాదికా అమృత మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం అనుభవించి అశువులు బాసిన మహనీయుల్ని స్మరించుకోవడం జరిగిందన్నారు. గ్రంధాలయ అధికారిణి సునీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ హరిత, సిబ్బంది రాజేశ్వరి, షేక్ అన్సర్ బేగం, గ్రంధాలయ ఉద్యోగి కె.సుధాకర్, చదువరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రామన్నపాళెంలో సమీక్ష సమావేశం నిర్వహింనిన ఎంపీడీఓ



**కొడవలూరు ఆగష్టు 10 ప్రభాతవార్త:** కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం కొరకు ముందస్తుగా చర్యగా ఎపిడీఓ సుబ్రహ్మణ్యం కొడవలూరు మండలం, రామన్నపాళెంలోని గ్రామ కార్యదర్శి, వెల్‌ఫేర్ అసిస్టేంట్, సచివాలయం సిబ్బంది మరియు వాలంటీర్లుతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 12వ తేది రామన్న పాలెంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో గ్రామంలో ప్రతి లబ్ధిదారుకు వచ్చే ప్రభుత్వ సంక్షేమ పథకాల పూర్తి సమగ్ర సమాచారం వివరాలను వెల్‌ఫేర్ అసిస్టేంట్‌లు, వాలంటీర్లు ముందుగానే సేకరించాలని సూచించారు.అంతేకాక ఆ గ్రామంలో పారిశుధ్యం పై పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అంతేగాక ఆ గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా అభవృద్ధి కార్యక్రమాలు ప్రారంభ దశలో ఉన్నవాటిని ఆ కార్యక్రమంలో ప్రారంభించే చూడాలని ఎఇలకు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాకి ధనమ్మ, గ్రామకార్యదర్శి సిఖామణి, వెల్‌ఫేర్ అసిస్టేంట్‌లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు గ్రామ నాయకులు పాల్గోన్నారు.